ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 11-12.2025 సమయం: 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికల తొలి విడత పోలింగ్ కొద్ది సేపటి క్రితం ముగిసింది. ఈ మధ్యాహ్నం ఓట్ల లెక్కింపు అనంతరం ఉప సర్పంచ్ ఎన్నిక నిర్వహిస్తారు.

2. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై రాహుల్ గాంధీ లోక్ సభలో చేసిన ఆరోపణలు హాస్యస్పదంగా ఉన్నాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు.

3. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలో పలువురు కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలతో సమావేశమై పలు సమకాలీన అంశాలపై చర్చించారు.
4. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ నిర్వహించిన ఫ్యూచర్ సిటీలో ఎగ్జిబిషన్ కు సందర్శకుల తాకిడి కొనసాగుతోంది.

-----------------------------------

**పంచాయితీ ఎన్నికలు:**

గ్రామ పంచాయితీ ఎన్నికల తొలివిడత పోలింగు కొద్ది సేపటి క్రితం ప్రశాంతంగా ముగిసింది. 3 వేల 834 గ్రామ పంచాయతీలు, 27 వేల 628 వార్డులకు ప్రశాంతంగా పోలింగ్ జరిగినట్లు మరికొద్ది సేపట్లో ఓట్ల లెక్కింపును చేపట్టనున్నట్లు రాష్ట్ర ఎన్నికల అధికారులు వెల్లడించారు. సర్పంచ్ పదవికి 12 వేల 960 మంది అభ్యర్థులు, వార్డు సభ్యుల స్థానాలకు 65 వేల 455 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. 93 వేల మందికి పైగా పోలింగ్ సిబ్బంది ఎన్నికల విధుల్లో పాల్గొన్నారు. కాగా మొదటి దశ పోలింగుకు నోటిఫికేషన్ ఇచ్చిన పంచాయితీల్లో 396

పంచాయితీలకు ఎన్నిక ఏకగ్రీవం అయింది. 9 వేల 633 వార్డు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 5 గ్రామ పంచాయతీలు, 169 వార్డులలో నామినేషన్లు దాఖలు కాలేదు.

**MSL**

-------------------------------------

**మొదటి విడత పోలింగ్**

రాష్ట్ర వ్యాప్తంగా ఈ ఉదయం జరిగిన తొలి విడత పంచాయతీ పోలింగ్ ను ఆయా జిల్లాల స్థాయిలో కలెక్టర్లు పర్యవేక్షించారు. పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పలు గ్రామాలను సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు.

నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి పలు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లతో మాట్లాడి ఏర్పాట్లపై అంచనాకు వచ్చారు.

కామారెడ్డి జిల్లాలోని 10 మండలాల్లో పోలింగ్ జరగగా కలెక్టరేట్ నుంచి వెబ్ క్యాస్టింగ్ ద్వారా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పర్యవేక్షించారు.

జగిత్యాల జిల్లాలో మొదటి విడత పంచాయతీ ఎన్నికల పోలింగ్ తీరును కలెక్టర్ బి సత్యప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్ పలు గ్రామాల్లో పర్యటించి పర్యవేక్షించారు.

సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలంలో పంచాయతీ ఎన్నికల ఓటింగ్ సరళిని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ కె. హైమావతి పరిశీలించారు.

కరీంనగర్ జిల్లాలో మొదటి విడత ఎన్నికల పోలింగ్ ప్రక్రియలో భాగంగా రామడుగు మండలం వెదిరలో పోలింగ్ సరళిని కలెక్టర్ పమెల సత్పతి పరిశీలించారు.

సంగారెడ్డి జిల్లాలోని 26 మండలాల్లో జరిగిన పోలింగ్ ను కలెక్టర్ పి. ప్రావీణ్య పరిశీలించారు.

రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరీమ అగర్వాల్ పలు కేంద్రాలను పరిశీలించారు.

సూర్యాపేట జిల్లాలో జరిగిన పోలింగ్ ను జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ పర్యవేక్షించారు.

జనగామ జిల్లాలోని పలు గ్రామాల్లో కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ పోలింగ్ తీరును పరిశీలించారు.

హన్మకొండ జిల్లాలో తొలి విడత పోలింగ్ ను జిల్లా కలెక్టర్ స్నేహా శబరీష్ పర్యవేక్షించారు.

మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఎన్నికల నిర్వహణను ప్రత్యక్షంగా పరిశీలించారు.

**పీటీసీలు, పెద్దపల్లి, నల్లగొండ, కామారెడ్డి, జగిత్యాల, సిద్దిపేట, కరీంనగర్, సంగారెడ్డి, రాజన్న సిరిసిల్ల, సూర్యాపేట, జనగామ, హన్మకొండ, మెదక్**

---------------------------

డీజీపీ

పంచాయతీ ఎన్నికల తొలివిడత పోలింగ్ కు బందోబస్తు ఏర్పాట్ల కోసం రాష్ట్ర పోలీసు యంత్రాంగంతోపాటు అటవీ, ఆబ్కారీ శాఖల నుంచి కూడా సిబ్బందిని వినియోగిస్తున్నట్లు పోలీసు డైరెక్టర్ జనరల్ శివధర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక పరిస్థితులను బట్టి సమస్యాత్మక, సాధారణ పోలింగ్ స్టేషన్లుగా విభజించామని, అందుకు తగ్గట్లుగానే భద్రత ఏర్పాట్లు చేశామన్నారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘనలకు సంబంధించి 229 కేసులు నమోదు చేసినట్లు వివరించారు.

డెస్క్

--------------------------

కిషన్ రెడ్డి

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ లోక్‌సభలో చేసిన ఆరోపణలు, వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఆయనకు ఎన్నికల వ్యవస్థపై కనీస అవగాహన లేదనే అంశం మరోసారి నిరూపితమైందని ఎద్దేవా చేశారు. ఈ మేరకు కిషన్‌రెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. బిహార్‌తోపాటు వివిధ రాష్ట్రాల ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమికి కారణాలు చెప్పుకోలేక.. రాహుల్ గాంధీ ఎన్నికల వ్యవస్థపై అసత్యాలు ప్రచారంచేసే కుట్రకు తెరతీశారన్నారు. ఒకవైపు ఓటర్ల జాబితా తప్పులతడకగా ఉందని ఆరోపిస్తూనే.. ఆ తప్పులను సరిదిద్దే ఉద్దేశంతో సర్వే నిర్వహిస్తుంటే విమర్శలు చేస్తున్నారని ఆక్షేపించారు.

డెస్క్

----------------------------

**ముఖ్యమంత్రి:**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ఉదయం ఢిల్లీలో కాంగ్రెసు పార్టీ అగ్ర నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలతో సమావేశం అయి పలు అంశాలపై చర్చించారు. ముఖ్యంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ముఖ్యమంత్రి గ్లోబల్ సమ్మిట్ నిర్వహించిన తీరు, వివిధ రంగాలలో పెట్టుబడులకు సంబంధించి కూడా ఈ సమావేశాల్లో ప్రస్తావించినట్లు తెలుస్తోంది. ముఖ్యమంత్రి వెంట మంత్రి వివేక్ వెంకటస్వామి, రాష్ట్ర కాంగ్రెసు పార్లమెంటు సభ్యులు ఉన్నారు.

**MSL**

**------------------------------**

తుమ్మల

కేంద్ర ప్రభుత్వం కొత్తగా రూపొందిస్తున్న విత్తన చట్టం-2025లో రైతు ప్రయోజనాలకు పెద్దపీట వేయాలని, రాష్ట్రాలకు విస్తృత అధికారాలు ఇవ్వాలని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. నకిలీ లేదా నాణ్యత లేని విత్తనాల వల్ల నష్టపోయే రైతులకు చట్టబద్ధమైన, కాల పరిమితితో కూడిన పరిహారం చెల్లించే నిబంధన ఉండాలని, రైతు పొందగలిగే అత్యధిక దిగుబడి ఆధారంగా పరిహారం లెక్కించాలన్నారు. విత్తన చట్టం ముసాయిదాలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున చేర్చాల్సిన అంశాలు, అభ్యంతరాలపై తుది నివేదిక రూపకల్పనకు నిన్న ఆయన సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పలు సూచనలు చేశారు.

డెస్క్

---------------------------

పొన్నం

రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టి 90కి పైగా ఆర్టీసీ బస్ డిపోలను లాభాల్లోకి తీసుకువచ్చిందని రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఈ పథకం ప్రారంభించి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా బస్‌భవన్‌లో నిన్న మంత్రి సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలోని 97 డిపోల్లోని అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఆర్టీసీ ఉద్యోగుల పిల్లల

కోసం ప్రత్యేక స్కూల్ ఏర్పాటు చేయడానికి కృషి చేస్తామన్నారు. రాష్ట్రంలో ప్రజల ప్రయాణాల్లో ఆర్టీసీ వాటా 28 శాతం ఉందని, విజన్-2047కి అనుగుణంగా 70 శాతానికి పెంచేందుకు ఉద్యోగులు కష్టపడాలని సూచించారు. గడిచిన రెండేళ్లలో 2వేల 476 బస్సులు కొనుగోలు చేశామని. కారుణ్య నియామకాలు చేపట్టామని. వచ్చే రెండేళ్లలో హైదరాబాద్‌లో 2వేల 800 ఈవీ బస్సులు రాబోతున్నాయని మంత్రి వివరించారు.

డెస్క్

----------------------------

ఎగ్జిబిషన్

తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్‌కు వేదికైన ఫ్యూచర్ సిటీలో నిన్న సందర్శకులు సందడి చేశారు. సమిట్ ప్రధాన ప్రాంగణం విద్యార్థులు, సాధారణ ప్రజలతో కిక్కిరిసిపోయింది. మహేశ్వరం నియోజకవర్గంతోపాటు చుట్టుపక్కల మండలాలు, హైదరాబాద్, సికింద్రాబాద్ ప్రాంతాల నుంచి విద్యార్థులు తరలివచ్చారు. ప్రధాన హాలు పక్కన ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన స్టాళ్లను వారు తిలకించారు. ఏఐ రోబోలు, టచ్ కియోస్క్‌లు, డిజిటల్ టన్నెల్ త్రీడీ తెరలు, వ్యవసాయం, ఉద్యానశాఖ, నెట్ జీరో సిటీ, ఇందిరా మహిళాశక్తి, ఏరోస్పేస్, ఏవియేషన్ స్టాళ్లతో పాటు భారత్ ఫ్యూచర్ సిటీ, స్కిల్స్ యూనివర్సిటీ, విద్యా, విద్యుత్‌శాఖలు, క్రెడాయ్, చేనేత, లైఫ్‌సైన్సెస్ సంస్థలు ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. ఈ సందర్భంగా సోలార్, బ్యాటరీతో నడిచే సైకిల్, వ్యవసాయ యంత్రాలు ఆకట్టుకున్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు సుమారు నాలుగు వేల మంది విద్యార్థులు సందర్శించారని అధికారులు తెలిపారు. ఈరోజు, రేపు, ఎల్లుండి కూడా సందర్శకులకు అనుమతి ఉంటుందని వివరించారు.

డెస్క్

----------------------

ప్రశంసలు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్' విజయవంతం చేయడంలో భాగమైన అధికార యంత్రాంగాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా

అభినందించారు. వేర్వేరు విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేశారని, సదస్సును విజయవంతం చేసి తెలంగాణ ఖ్యాతిని ప్రపంచవ్యాప్తంగా చాటారని అన్నారు. ఈ ఉత్సవాల కోసం సీనియర్ ఐఏఎస్ అధికారుల మార్గదర్శకత్వంలో... యువ ఐఏఎస్ అధికారుల బృందం కార్యాచరణ ప్రణాళికను ఆచరించారని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. సదస్సుకు ఏర్పాట్లు, అతిథులకు ఆహ్వానాలు, అధికారులతో సమీక్షలు తదితరాలను ప్రణాళికాబద్ధంగా నిర్వహించారు. మొత్తం ప్రక్రియ ప్రణాళికాబద్ధంగా సాగేలా ప్రభుత్వం 'వార్ రూమ్' ఏర్పాటు చేశారు. 'తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్' రూపొందించేందుకు అన్ని శాఖల అధికారులతో సీఎస్, ఇతర అధికారులు సమన్వయం చేసుకున్నారు.

డెస్క్

---------------------------

బీర్ల

గ్రామ పంచాయితీ ఎన్నికల్లో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం సైదాపూర్ లో తెలంగాణ ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య కుటుంబ సమేతంగా తమ ఓటు హక్కును ఈ రోజు వినియోగించుకున్నారు. ప్రజలు అందరూ ఓటు విలువను గుర్తించి బాధ్యతగా వినియోగించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

పిటిసి, యాదాద్రి

-------------------------

వనపర్తి

గ్రామపంచాయతీ ఎన్నికలలో భాగంగా వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పెద్దమందడి మండలం, మంగంపల్లి గ్రామంలో తన సతీమణితో కలిసి ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు విలువను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని కోరారు.

పీటీసీ వనపర్తి

----------------------

**సదరం శిబిరం**

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రధాన ఆస్పత్రిలో ఈనెల 15న సదరం శిబిరాన్ని ప్రారంభిస్తున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ లక్ష్మినారాయణ ఒక ప్రక టనలో తెలిపారు. 15న కంటిచూపు, 16న ఆర్థో, మానసిక, 17న మానసిక, జనరల్, వినికిడి, 18న ఆర్థో, వినికిడి, 19,20 తేదీల్లో ఆర్థో విభాగానికి సంబంధించిన పరీక్షలు నిర్వ హిస్తామన్నారు. అర్హులైన దివ్యాంగులు సంబం ధిత మెడికల్ రిపోర్టులు, ఎక్స్ రే, ఆధార్ కార్డు, పాస్పోర్టు సైజ్ ఫొటో, ఫోన్ నెంబర్, దర ఖాస్తు ఫారంతో సహా ఆయా తేదీల్లో శిబిరానికి హాజరుకావాలన్నారు.

**పీటీసీ – రాజన్న సిరిసిల్ల**

---------------------------

**FACT CHECK**

కొత్త కార్మిక నియమావళి ప్రకారం ఫ్యాక్టరీ యజమానులు కార్మికులతో 12 గంటలు పనిచేయించుకొని కూడా 8 గంటలు మాత్రమే జీతం చెల్లిస్తారంటూ సోషల్ మీడియాలో వైరల్ అవుతోన్న వీడియోను ప్రభుత్వం తోసిపుచ్చింది. ఇప్పుడు కార్మికుల విశ్రాంతి సమయాన్ని కూడా ఫ్యాక్టరీలే నిర్ణయిస్తాయని ఆ వీడియోలో పేర్కొన్నారు. ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఫ్యాక్ట్ చెక్ యూనిట్ ఈ రెండు వాదనలు నకిలీవని తెలియజేసింది. కొత్త కార్మిక నియమావళి ప్రకారం కార్మికులకు ఓవర్ టైం పనికి రెట్టింపు వేతనం చెల్లించాలని, ఓవర్ టైం కోసం కార్మికుడి సమ్మతి తప్పనిసరి అని జోడించింది. ఫ్యాక్టరీల్లో పనిచేసే కార్మికులకు విశ్రాంతి సమయం, విస్తరణను నిర్ణయించే అధికారం ఫ్యాక్టరీ యజమానులకు కాకుండా ప్రభుత్వానికే ఉందని PIB హైలైట్ చేసింది.

**NSD**

---------------------------

యునిసెఫ్

ఈరోజు యునిసెఫ్ ఆవిర్భావం దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ 1946లో యునిసెఫ్‌ను స్థాపించిన రోజును ఈ తేదీ సూచిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న పిల్లల హక్కులు, శ్రేయస్సు, అభివృద్ధి కోసం యునిసెఫ్ చేసిన కృషిని ఈ దినోత్సవం

గుర్తిస్తుంది. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత ప్రభావితమైన పిల్లలు, తల్లులకు అత్యవసర ఆహారం, ఆరోగ్య సంరక్షణ, సహాయాన్ని అందించాలనే లక్ష్యంతో ఈ సంస్థ ప్రారంభమైంది.

జీఎస్

---------------------------